క్లుప్తంగా

వృద్ధులకు పండ్లు పంపిణీ

పోరుమామిళ్ల : మండలంలోని ఇందిరానగర్‌లో గురువారం భారతీయ జనతాపార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉట్టి శ్రీనివాసులు ఓబుళాపురం సమీపంలో ఉన్న వివేకానంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక ఈశ్వరరెడ్డినగర్ బైపాస్ రోడ్డులోని అమ్మానాన్న మదర్ థెరిసా (షబ్బీర్) వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 22వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి హిదాయత్, పార్టీ నాయకులు ఫక్రుద్దీన్, గౌస్, కరీముల్లా పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో వృద్ధుడు మృతి


వృద్ధుడి మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. అనారోగ్యంగా అతన్ని గత నెల 23న ఆస్పత్రిలోని ఎంఎం 2 వార్డులో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతను గురువారం మృతి చెందాడు. అడ్మిషన్ రిజిష్టర్‌లో అతని పేరు మహబూబ్‌హుస్సేన్ (53), ఎర్రగుంట్ల అని ఉందని సిబ్బంది తెలిపారు. అయితే అతని బంధువులు ఎవరూ రాకపోవడంతో మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. మృతుని కుటుంబ సభ్యులు ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు.

'వారంతా టీడీపీ కార్యకర్తలే'

ప్రొద్దుటూరు : గోపవరం గ్రామ పంచాయతీ ద్వారకానగర్‌లో టీడీపీలో చేరిన వారంతా పాత టీడీపీ కార్యకర్తలేనని, వీరిలో ఏ ఒక్కరూ వైఎస్సార్‌సీపీ కార్యకర్త లేరని వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 30 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్టీలో ఉన్న వారికే కండువాలు వేసి మా పార్టీ వారు అని చెబితే ఎలా అన్నారు. సమావేశంలో సచివాలయ కన్వీనర్ వంగల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు కల్చరల్ : సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జనవిజ్ఞాన వేదిక ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ కాల్వ విజయ నాగేంద్ర అన్నారు. స్థానిక రాణీతిరుమల డిగ్రీ కళాశాలలో గురువారం జేవీవీ ఆధ్వర్యంలో మనిషి స్పృహ కోల్పోయినప్పుడు ఏమి చేయాలి అనే అంశంపై సదస్సును నిర్వహించారు. మనిషి స్పృహ కోల్పోయినప్పుడు ప్రథమ చికిత్సగా సీపీఆర్ చేసి వ్యక్తిని ఎలా కాపాడవచ్చునో వివరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి, జేవీవీ ఆరోగ్య విభాగం జిల్లా కన్వీనర్ డాక్టర్ చక్రధర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి


వృద్ధాశ్రమ నిర్వాహకులకు నగదు, నిత్యావసర వస్తువులు అందచేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని శ్రీచక్ర పాఠశాల చైర్‌పర్సన్ ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక థర్మల్ రోడ్డులోని విశ్వప్రేమ వృద్ధాశ్రమంలో జాయ్ ఆఫ్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా శ్రీ చక్రపాఠశాల విద్యార్థులు వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులతో సరదాగా గడిపారు. పిల్లల చేతుల మీదుగా భోజనం వడ్డించారు. చిన్నారులు అందచేసిన రూ.21,930 నగదు, నిత్యావసర వస్తువులను, పండ్లను వృద్ధులకు పంపిణీ చేశారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరించాలి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వలంటీర్లతోపాటు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి అన్ని వార్డులు, గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వం ఇంత వరకు ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేయలేదని ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, గ్రామ సచివాలయాల కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, పట్టణ సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, 5వ వార్డు ఇన్‌చార్జి తేజ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన పర్వత రెడ్డి సరళకు రూ.2.50 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైంది. ఈ చెక్కును ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా గురువారం లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మండల గ్రామ సచివాలయాల ఇన్‌చార్జి కల్లూరు నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సంక్షేమ పథకాల గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదన్న మాట వినడపడకూడదని అధికారులకు సూచించారు. గ్రామంలోని ప్రజలు తమకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రోడ్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు పెట్టాలని సూచించారు. ప్రజలకు సంక్షేమ పథకాలను ఇంటికే చేరవేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో ఆశీర్వదించి మరొకసారి గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాయలసీమ సచివాలయ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ గోపిరెడ్డి బాబు, సర్పంచ్ రాజు పాళెం మాబు షరీఫ్, ఎంపీటీసీ గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, ఓబులరెడ్డి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్


కార్యక్రమానికి హాజరైన పొదుపు సంఘాల మహిళలు

కాశినాయన : మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడవ విడత కార్యక్రమం నిర్వహించి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మండలంలోని 594 డ్వాక్రా సంఘాలలోని మహిళలకు రూ.3.93 కోట్ల మెగా చెక్కును అందజేసి వారు మాట్లాడారు. మహిళలు ఆర్థికాభివృద్ధిలో పయనిస్తేనే వారి కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని తెలిపారు. అధికారంలోకి వస్తే డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీని విస్మరించి డ్వాక్రా మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. రాజకీయ పదవులతో పాటు నామినేటెడ్ పదవులను సైతం అధిక శాతం మహిళలకు కేటాయించిన ఏకైక సీఎం జగన్ అన్నారు. మహిళలు వైఎస్సార్ ఆసరా నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని వారు సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ హనుమంతరెడ్డి, ఏపీఎం వీరాంజనేయులు, ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

గోపవరం : మండల వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణలతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇళ్లు మంజూరై ఇప్పటి వరకు మొదలు పెట్టని లబ్ధిదారులతో మాట్లాడి అవి మొదలు పెట్టేలా చూడాలని, ఈ బాధ్యతను పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలన్నారు. 80 శాతం ఇళ్లు స్లాబు దశలో ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలన్నారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై దృష్టి పెట్టి ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్ కుమార్

చాపాడు : గ్రామాలలో గర్భిణుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గ్రామ సచివాలయాల ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు వైద్యాధికారి అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదు చేయబడిన గర్భిణుల వివరాలు, ఆరోగ్య సిబ్బంది నమోదు చేసిన వివరాలలో తేడాలు ఉండరాదన్నారు. ఇద్దరు సమన్వయంతో వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి వారంలో రెండు రోజుల పాటు వ్యాధి నిరోధక టీకాలు అందేలా చూడాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ మాట్లాడుతూ గర్భిణుల రక్తహీనత లేకుండా పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గర్భవతులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునేలా వైద్య సిబ్బంది చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీవాణి, ఓబులేసు, సీహెచ్ఓ రాముడు, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, నారాయణ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు పల్లవోలులో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని పల్లవోలు గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటలకు సాయంత్రం 4 గంటలకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తామని, ఇదే క్రమంలో ఇళ్లలో ఉండే దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు చేస్తామని ఆయన తెలిపారు.

రాజుపాళెం : గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల పిల్లల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల అన్నారు. రాజుపాళెంలోని పీహెచ్‌సీలో గురువారం మండలంలోని ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది కలిసి సర్వేను తేడాలు లేకుండా ఖచ్చితంగా చేయాలని సూచించారు. మండల నోడల్ అధికారి సుధాకర్ మాట్లాడారు. సీహెచ్ఓ పార్వతమ్మ, ఎంపీహెచ్ఈఓలు శివశంకర్‌రెడ్డి, రవిశంకర రాజు, సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, ఎల్టీ కంప్యూటర్ శివ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ప్రారంభం


ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

బి.కోడూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండల వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఏ.ఉదయకిరణ్‌ల ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సంగటిదావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, బి.కోడూరు సర్పంచ్ కొండామునిరెడ్డిలు 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ప్రారంభించారు. ఇక నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, హైరిస్క్ గర్భిణులు, మంచంలో ఉన్న వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రతి ఇంటికి డాక్టర్ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నరసింహారెడ్డి, సీహెచ్ఓ నాగమణి, పీహెచ్ఎస్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, స్టాఫ్‌నర్సు రాజమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సువర్ణ, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేకర్, ఫార్మాసిస్టు వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్యం

ప్రొద్దుటూరు క్రైం : పేదవారికి అందుబాటులోకి వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభోత్సవం చేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ పేద ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ మోషా, ఉప సర్పంచ్ రాఘవేంద్రరెడ్డి, ఎంపీటీసీ దస్తగిరిరెడ్డి, వైద్యాధికారులు డాక్టర్లు హనీఫ్‌బాబా, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, సీహెచ్ఓ కృష్ణమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

రామకోటి పుస్తకాల పంపిణీ

పోరుమామిళ్ల : రామాయపల్లె పాఠశాలలోని 5వ తరగతి విద్యార్థులకు గురువారం ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకుల శ్రీనివాసులు రామకోటి పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ పుస్తకాలు ఇంట్లోని పెద్దలకు అందచేయాలన్నారు. మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఈ పుస్తకాలు దోహదపడతాయన్నారు. పుస్తకాలు పూర్తి చేశాక వాటిని భద్రాచలం పంపిస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ తుపాకుల శ్రీనివాసులు, యోగా గురివిరెడ్డి పాల్గొన్నారు.

జ్యోతిష్య శిరోమణి పురస్కారం

ప్రొద్దుటూరు : ఉగాది పురస్కారాల కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని విశ్వజ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన డాక్టర్ వీవీ మోహన్ కుమార్‌కు జ్యోతి ష్య శిరోమణి పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎస్ ట్రస్టు నిర్వాహకులు ప్రసాద్ ఆయనకు అభినందనలు తెలిపారు.

'జగనన్నే మా భవిష్యత్'ను విజయవంతం చేయాలి

గోపవరం (బద్వేలు అర్బన్) : బద్వేలు నియోజకవర్గంలో ఈనెల 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ప్రభుత్వ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డిలు అన్నారు. గురువారం బద్వేలు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 7 మండలాల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రారంభించాలన్నారు. పార్టీ ఇచ్చిన మెటీరియల్‌తో ప్రతి ఇంటికి వెళ్ళి 2014 ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ఏ మేరకు అమలు చేశారో, 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో అమలు తీరుపై ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు కె.రమణారెడ్డి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వైభవం.. హనుమత్ విజయోత్సవం


రాజుపాళెం: వెల్లాల గ్రామంలో ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలో గురువారం హనుమత్ విజయోత్సవ కార్యక్రమాన్ని ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా చెన్నకేశవ, సంజీవరాయ స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామిని ఆశీనులు చేసి ఆలయంలోని పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామసుబ్బారెడ్డి, కానాల రామచంద్రారెడ్డి, సుదర్శనరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామాన్ని డాట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వరి పొలాలను పరిశీలించి పంటలో ఎక్కువగా కాండం కుళ్లు తెగులుతోపాటు మెడవిరుపు తెగులు ఉందని తెలిపారు. రబీలో పంటను సకాలంలో వేయనట్లయితే ఎక్కువగా మెడ విరుపు తెగులు వస్తుందని అన్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు ఎకరాకి 400 ఎంఎల్ హెక్సాకేనజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. వేసవి కాలంలో సాగు చేసిన పంటలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందని, రైతులందరూ వివరాలను వీఏఏ ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. పీఎంకిసాన్‌కు సంబంధించి రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి శివశైలజ, మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలి

బద్వేలు : పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెద్దిరాజు తెలిపారు. గురువారం పోరుమామిళ్ల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలతో హౌసింగ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఇందుకోసం లబ్ధిదారులను నిరంతరం కలిసి అవగాహన కల్పించి వారిని సమాయత్తం చేయాలన్నారు. సమావేశంలో ప్రత్యేకాధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ నూర్జహాన్, తహసీల్దారు విజయకుమారి, ఏఈలు రమేష్‌బాబు, మహేష్, ఏపీఎం అశోక్, సీడీపీఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


మైదుకూరు: పార్టీ జెండాను ఎగురవేసిన సుబ్బరాయుడు

మైదుకూరు : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు పార్టీ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్ రాజమోహన్ రెడ్డి, అసెంబ్లీ మాజీ కన్వీనర్ అన్నపురెడ్డి శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ 44వ సంస్థాపక దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కర్నాటి ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు గొర్రె శ్రీనివాసులు పార్టీ జెండాను ఎగురేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలు విన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం, 32వ వార్డు ఇంచార్జి వెంకటసుబ్బయ్య, నాయకులు శరత్‌బాబు, గంగాధర్‌రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

104 వైద్యసేవలను వినియోగించుకోవాలి

గోపవరం (బద్వేలు అర్బన్) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన 104 వాహనం ద్వారా ఇంటింటికీ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. గురువారం బద్వేలు మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో 104 వాహనం ద్వారా ఇంటింటికి వైద్య సేవలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణయ్య, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య పాల్గొన్నారు.

నెమలి వాహనంపై ముక్తిరామలింగేశ్వరుడు



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి నెమలి వాహనంపై ఊరేగారు. ఉదయం సైకతలింగానికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. రాత్రి మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేశారు.

ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ప్రభాకర్‌కు ఆహ్వానం

ప్రొద్దుటూరు: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ప్రొద్దుటూరుకు చెందిన రచయిత, కవి డాక్టర్ ఎం.ప్రభాకర్‌కు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆహ్వానం పంపారు. శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో ఈనెల 9, 10 తేదీలలో 48 గంటలపాటు నిర్విరామంగా ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేదికపై ప్రముఖ కవి కీర్తిశేషులు సగబాల రాజన్న కవి రచించిన పుస్తకాల సంకలనాన్ని ఆవిష్కరించనున్నట్లు డాక్టర్ ఎం.ప్రభాకర్ తెలిపారు.

ప్రముఖ జ్యోతిష్య పండితుడు సరస్వతి కోటమ రాజు మృతి


సరస్వతి కోటమ రాజు (ఫైల్)

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన ప్రముఖ వాస్తు, జ్యోతిష్య పండితుడు, బాలత్రిపుర సుందరిదేవి ఆలయం వ్యవస్థాపకుడు సరస్వతి కోటమ రాజు (68) గురువారం ఉదయం శివైక్యం చెందారు. జ్యోతిష్య శాస్త్రంపై మక్కువతో చిన్న వయసులోనే ఆ శాస్త్రంపై సాధన చేశారు. జ్యోతిష్య శాస్త్రంపై పట్టు సాధించగా 61 ఏళ్లుగా వాస్తు, జ్యోతిష్య శాస్త్రంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయన కుటుంబం ఏడు తరాల నుంచి వాస్తు, జ్యోతిష్యం చెబుతుండటంతో పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల ప్రజలకు సుపరిచితుడు. ఆయనకు జిల్లాతోపాటు హైదరాబాద్, అనంతపురం, తిరుపతి, అమెరికాలో కూడా శిష్యులు ఉన్నారు. శుక్రవారం ఉదయం అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు ఆయన కుమార్తె ధనలక్ష్మి, అల్లుడు గోపాలకృష్ణ, బాలాజీరాజు తెలిపారు. ఆయన మృతి పట్ల పట్టణ ప్రముఖులు, పలువురు శిష్యులు సంతాపం తెలిపారు.